# రాజీ

నర్సిమ్ముకి ఇరవయ్యేడేళ్లు. మనిషినల్లగాపొట్టిగావుంటాడు. కాని కళైన ముఖమే. డ్రైవింగ్‌లో మంచి నేర్పుంది. కొద్దిగా చదువుకున్నాడేమో కారు గురించి మాట్లాడినప్పుడు ఇంగ్లీషు వాడుతూ వుంటాడు. ఉదయం ఎనిమిదింటికి టంచన్‌గా వస్తాడు. రాగానే కారు చెట్టుకింద పార్క్ చేసేక, ముందు కారు లోపల దుమ్ము శుభ్రం చేసేస్తాడు.

గత యిరవై యేళ్లలోనూ మా దగ్గర ఏడెనమండుగురు డ్రైవర్లు మారేరు. అందులో చెప్పుకోదగ్గవాళ్లు శంకర్, మస్తాన్. వాళ్లు కూడా నీట్‌నెస్‌లో నర్సిమ్ము కాలి గోటికి సరికారు. వీడు నాదగ్గర చేరి ఏడాదయింది.

ఓసారి తెల్లవారగట్లే నేనూ, మా ఆవిడ బంధువుల్ని రిసీవ్ చేసుకోవడానికి, తలవని తలంపుగా, స్టేషన్‌కి వెళ్లవల్సి వొచ్చింది. నేనే కారు డ్రైవ్‌చేయాల్సొచ్చి షెడ్‌లోకి వెళ్లి కారు స్టార్ట్ చేసి హెడ్‌లైట్స్ ఆన్ చేసేటప్పటికి నా దృష్టి ఎదురుగా వున్న గోడ మీద పడింది. కారు బయటికి తీసి ఆ దృశ్యం తిలకించటానికి లోపలికి మా ఆవిణ్ణిరమ్మన్నాను. గోడ మధ్య రెండు వరుసల్లో ఒక డజను, వివిధ భంగిమల్లో, ఒకే సైజుకి కత్తిరించి అంటించిన సినిమా నటీనటుల అర్ధనగ్న వర్ణచిత్రాలున్నాయి. వాటిపైన రంగు పెన్సిల్‌తో 'ఎతింగ్ ఆఫ్ బ్యూటీ ఈజె జోయ్ ఫరెవర్' ఇంగ్లీషులో కేప్షన్ రాసుకున్నాడు. ఒక్క బ్యూటీ అన్న మాటలోనే స్పెల్లింగ్ మిస్టేక్ వుంది. వాడు సౌందర్య పిపాసి అని అర్థమైంది.

కార్లో వెడుతుంటే "నర్సిమ్ము తండ్రి లారీ డ్రయివర్, తల్లి వాళ్లింటి అరుగు మీదే కూరలదుకాణం నడుపుకుంటుంది. నూట యిరవై గజాల స్థలంలో చిన్న సొంతిల్లు కూడా వుందిట. నర్సిమ్ముకో చెల్లెలుంది. నిరుడు పెళ్లిచేసేసేరు. వీణ్ణి పెళ్లి చేసుకోమని ఎన్ని సంబంధాలు చూపెట్టినా పిల్ల నచ్చలేదు పొమ్మంటున్నాట్ట" అంది మా ఆవిడ.

"ఎవరు చెప్పేరు?" అడిగేను. మా పిల్లలు పెద్దవాళ్ళయి ఉద్యోగాలు చేసుకుంటూ దేశాలంట తిరుగుతున్నారు. ప్రస్తుతం నర్సిమ్ము మా ఆవిడకి దత్తపుత్రుడు. మా పిల్లల పెళ్లిళ్ల భాగోతం ఇంకా సశేషంగానే వుంది. ఇప్పుడు వీడి పెళ్లి గురించి లాగుంది ఈవిడ ఆందోళన!

"వాళ్లమ్మే నెల్లాళ్ల క్రితం, వాళ్లింట్లో కాసిందని ఓ ఆనపకాయ పట్టుకొచ్చికాస్సేపు కూర్చుంది. అప్పుడు చెప్పింది."

ఏమాటకామాటే చెప్పుకోవాలి. మా పెద్దాడు మంచి రంగు, అందమైన ముఖం. పెద్ద పొజిషన్‌లో వున్న మా ఫ్రెండ్ కూతుర్ని చేసుకున్నాడు. మా కోడలు అప్సరసా కాదు, అనాకారి కాదు, సంసార పక్షంగావుంటుంది. పెళ్లి చూపులైన తర్వాత మావాడు కొంచెం నసిగేడు కానీ మా ఫ్రెండ్ హోదా, పలుకుబడి, ఆ అమ్మాయి చదువు సంస్కారం గురించి మా ఆవిడ గట్టిగా చెప్పగానే మాట్లాడకుండా ఒప్పుకున్నాడు. ఇప్పుడు వాళ్లు చిలకా గోరింకల్లా వున్నారు. ఈమధ్యనే వాడు తండ్రికూడా అయ్యేడు.

మారెండోవాడు సమస్యై కూర్చున్నాడు. వాడిది నా రంగు, పైగా పరకాయించి చూస్తే మొహంమీద స్ఫోటక మచ్చలు కనపడతాయి. మరి తెలివి తేటలకి లోటు లేదు. ఐయేయస్ పేసయ్యేడు. డైరక్టరాఫ్ టూరిజంగా పోస్టుచేసేరు. మంచి సరదా అయినవాడు, చలాకీ అయినవాడు అని పేరు తెచ్చుకున్నాడు. వీడు గోడలకి సినిమా స్టార్స్ బొమ్మలంటించడు కాని మరి మనస్సులో ఏం బొమ్మలున్నాయో తెలీదు. మా పెద్దాడికంటే మంచి సంబంధాలొచ్చాయి. పిల్లని చూడరా అంటాం. ఊహూఁ! ఫోటో చూసి పిల్ల నచ్చలేదు పొమ్మంటాడు. ఇంక విసుగెత్తి సంబంధాలు చూడ్డం మానుకున్నాం.

మళ్లీ మా ఆవిడ, "నర్సిమ్ము తల్లి గోలెత్తింది. వాళ్ల తప్పులేదండి. మంచి అందమైన పిల్ల, ఉద్యోగం చేసుకుంటున్నది కావాలంటాడట. కట్నం లేకపోయినా సరే వాడికి నచ్చిన పిల్ల దొరికితే చాలు అని వెతుకుతున్నారుట" అంది సానుభూతి ఒలకబోస్తూ.

"అదిసరే, నర్సిమ్ము తల్లి ఆనపకాయ పట్టుకొచ్చి యిచ్చిందటున్నావు. అసలే కూరలు వ్యాపారం చేసుకునే మనిషని నువ్వే చెప్పావు. నువ్వేదైనా...."

"ఆమాత్రం తెలియదా ఏమిటండీ. రెండు సీసాల్లో ఉరగాయ పచ్చళ్లిచ్చి పంపేను" అంది మా ఆవిడ.

"అలా వుండాలి వ్యాపార జ్ఞానం! ఏ ఆడదీ పేదపిల్లని, అందం చూసి చేసుకోడానికి ఒప్పుకోదు, ఎటొచ్చీ కొంచెం రేటు తగ్గించుకుంటుంది, కొడుకు కోరిక తీర్చడం కోసం."

"ఛా! అదేం లేదండి. అలాంటి మనిషిలా కనపడలేదు. ఒక్కగానొక్క కొడుకు. వాళ్లకున్నది వాళ్లకు చాలు. పాపం! మావోళ్లల్లో అంత అందమైన పిల్లలెక్కడ దొరుకుతారమ్మా! అంత అందమైందీ కాస్తో కూస్తో చదువుకుని ఏ చిన్న నౌకరీయో చేసుకుంటున్నదీ అయితే వీణ్ణెందుకు చేసుకుంటుంది! వీడేమీ మన్మథుడా! అంటూ

గోలెడుతుంది" అంది మా ఆవిడ. మరి వాడి సమస్య "మావోళ్లలో"కి పరిమితమైందా! "మన్మధుడా!"కి పరిమితమైందా అని ఆలోచించడం మొదలెట్టాను.

అసలు నాలాగే ఏభయ్యో పడిలో పడిన ప్రతివాడూ ఏదో సందర్భంలో ఎందుకు చేసుకున్నానీ పెళ్లి! ఏమిటీ పెళ్లాం! ఎందుకొచ్చిన బిడ్డలు! పెళ్లాడ్డం వల్ల సుఖపడతానని భ్రమపడ్డాను! నాన్‌సెన్స్! నా నీతి, నిజాయితీలు, నా సరదాలు, నా జీతం, నా జీవితం అంతా నా పెళ్లాం బిడ్డలకే అంకితం. వాళ్ల సుఖదుఃఖాలకే నా స్వతంత్రాన్ని తాకట్టు పెట్టి ఈ ఊబిలో దిగబడ్డాను. అసలు నేను పెళ్లాడకపోతే ఎంత బాగుండును!" అని ఏడవని వాడుండడు. ఆ దుఃఖం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోడం లాంటిదని గ్రహించి, పెళ్లాం బిడ్డల వల్లతన జీవితంలో సుఖపడ్డ కొన్ని క్షణాలు, కొన్ని సంఘటనలు నెమరువేసుకుంటూ ఆ దుఃఖాన్ని దిగమింగుకుంటూ వుంటాడనుకుంటాను. ఎందుకు చెప్పండి పిల్లల పెళ్లిళ్ల గురించి ఈ వర్రీ!

మన రాష్ట్రానికి విఐపిలు ఎవరొచ్చినా, కర్నూల్ నా హెడ్‌క్వార్టర్స్ కనుక శ్రీశైలం తీర్థయాత్ర, ప్రోజెక్ట్ సందర్శనం, కూడా వుండి జరిపించడం నా విధుల్లో ఒకటైపోయింది.

అలాంటి అపరకర్మ పౌరహిత్యమే అనివార్య మనవడంతో, మర్నాడు ఉదయం శ్రీశైలం ప్రయాణానికి సిద్ధమౌతున్నాను. అసలే విసుగ్గా వుంది. బట్టలు సర్దుకుంటుంటే, ఓ పాత పట్టుచీర నా సూట్‌కేసులో పెడుతూ "బంగళా వాచ్‌మెన్ పెళ్లాం ఎల్లమ్మ కివ్వండి. పాపం! కిందటిసారి వెళ్లినప్పుడు ప్రామిస్ చేశాను" అంది. సరే అన్నాను. అంతటితో వూరుకుంటే బాగుణ్ణు.

"మన నర్సిమ్ముల్ని ఎల్లమ్మ కూతురు జానకిని చూసుకోమనండి. ఆ పిల్ల నిజంగా రంభలా వుంటుంది. మెట్రిక్ పేసయింది. బాల్‌వాడీ నడుపుకుని పదిరూపాయలు సంపాయించు కుంటుంది. ఇప్పుడు టూరిస్ట్‌గైడ్‌గా వేయించేరు కదా! అలా కూడా కాస్తో కూస్తో సంపాదించుకుంటుంది. వాళ్లిష్టపడితే వాళ్ల పెళ్లికి మనం కూడా కాస్తో కూస్తో సాయం చేద్దాం. కాస్తంత పుణ్యం.."

"ఇలాంటి వాటిల్లో తలదూర్చకు. వాళ్లిద్దరూ ఇష్టపడటంతో సరిపోదు. ఇటు బంగళా వాచ్‌మన్ అటు లారీ డ్రయివర్ మధ్య రాయబారాలు సంప్రదింపులు. పోనీ ఓ పన్జెయ్యి. మరో వారం పదిరోజుల్లో నేనెలాగూవెళ్లాలి. అప్పుడు నువ్వొచ్చి...." అటుంటే ఇంక వినలేనన్నట్లుగా లోపకెళ్లి పోయింది.

రేపు రాబోయే అతిథుల గురించి ఆలోచిస్తూ విసుక్కున్నాను కాని, ఆ వాచ్‌మన్ కూతురు జానకి, జ్ఞాపకం రాగానే, ఆ పిల్ల విషయంలో, కార్లో వెడుతున్నప్పుడు నర్సిమ్లుకి గట్టిగా చెప్పాలనే నిర్ణయించుకున్నాను. ఇరవై రెండేళ్లుంటాయి. ఛార్మింగ్ గర్ల్. నాలుగు నెలల క్రితం ఇద్దరు ఇంజనీర్లు తమ భార్యలతో వొచ్చేరు. ఒంట్లో బాగోలేక మా ఆవిడ రాలేదు. బంగాళాలో వాళ్ళకి సపరిచర్యలు చేసి, వాళ్ల మనస్సులెలా ఆకట్టుకుందో తెలీదు. వచ్చిన ఆడవాళ్లు ఆ పిల్లని కూడా తీసుకెళ్దామన్నారు. దేవాలయంలోనూ, ప్రోజెక్ట్ దగ్గరా ఇంగ్లీషులో చకచక మాట్లాడేస్తుంటే దంగైపోయి ఒకావిడ వందరూపాయలిచ్చింది. ఒకావిడ రిస్ట్‌వాచి యిచ్చింది. ఒపిగ్గా వాళ్లకీ వాళ్ల పిల్లలకీ చారిత్రాత్మక విషయాలు, పౌరాణిక గాథ వివరించింది. తర్వాత నేనే ఆ పిల్లపేరు అప్రూవ్డ్ గైడ్‌గా రికమండ్ చేసి వేయించేను.

పొద్దున్నే ప్రయాణమయ్యే ముందు, సంతోషిస్తుందని నర్సిమ్లుతో గట్టిగాచెప్పి ఒప్పిస్తానన్నాను, మా ఆవిడ మొహం ధుమధుమలాడ్డం చూసి.

"మనకా శ్రమ తప్పింది. వాడికిష్టం లేదుట. పొద్దున్నే ఆ విషయం వాడితో కదిపేను" అంది.

"ఎందుచేతట?" అడిగేను. నా హృదయాంతరాల్లో కాకి ముక్కుకు దొండపండనిపించినా, ఈనాటి సామాజిక వ్యవస్థ, పెళ్లి ఖర్చులు ఆలోచించి రాజీ పడ్డానేమో, ఈ వార్త వినగానే మనస్సు తేలికపడింది.

"వాళ్లు ఈడిగలండి. మాకులమోళ్లు ఒప్పుకోరు. అని ఖచ్చితంగా చెప్పేసేడు" అంది.

ఆ మాట వింటుంటే నాకు ఒళ్లు మండిపోయింది. మేం పెళ్లిళ్లు చేసుకున్న రోజుల్లో అంటే ఏభయ్యేళ్ల క్రితం వరకూ అందచందాల ప్రసక్తి వొచ్చినప్పుడు ఆడపిల్ల కాస్త అటూ యిటూ వుంటే "అందం ఏమిట్రా! కొరుక్కుతింటారా!" అని నచ్చ చెప్పేవాళ్లు, మొగపిల్లాడి విషయంలో అయితే "మొగాడికల్లా ముఖ్యం అందంటండి! పదిరాళ్లు సంపాదిస్తున్నాడు, ప్రయోజకుడు" అని నచ్చచెప్పేవారు. ఆనాడు సామాజిక విలువలకిచ్చే ప్రాముఖ్యత అందచందాలకిచ్చేవారు కాదు. సినిమాల్లో అయితే హీరో హీరోయిన్లిద్దరూ మంచి అందంగా ఉంటారు. కులం, అంతస్తులూ, చదువు సంధ్యలు లాంటి ఏ అడ్డుగోడలయినా, ధైర్యంగా, డైరెక్టర్ సహాయంతో, వాటిని కూలదోసి, కన్నుల పండుగ్గా పెళ్లి చేసుకుంటారు. మళ్లీ నిజ జీవితంలో అలాంటి జంటలు అరుదుగా కనబడతారు. దానికి కారణం అంతస్తుల విషయంలో కాని కులం విషయంలో కాని రాజీపడకపోవడమే. 'మావోళ్లల్లో' అని నర్సిమ్లు తల్లి అందని వినగానే ఈ సమస్యకి పరిష్కారం అంత సులభం కాదనిపించింది. ఇదేమీ సినిమా కథ కాదు.

మర్నాడు నర్సిమ్లు రాలేదు కాని నర్సిమ్లుతల్లి మాయింటికొచ్చి మా ఆవిడతో మాట్లాడిందిట.

"మన దగ్గర పని మానేసినట్లేనా?" అడిగేను.

"ఆహా!"

"ఏం?"

"పెళ్లి కుదిరింది."

"మనతో చెప్పొచ్చుగా!"

"ముందు వాడిరోగం కుదిరింది. తర్వాత పెళ్లి కుదిరిందిట. సిగ్గుపడి మనదగ్గరకు రాలేదు."

"రోగం ఏమిటి?"

"సౌందర్య పిపాస!"

"ఏం జరిగింది?"

"వీళ్ల పక్కవీధిలో ఓ ప్రయివేట్ నర్సింగ్‌హోం వుందట. వాళ్లకి ఓ ఏంబులెన్స్ వుంది. రెండునెలల నుండి రోజు విడిచి రోజు రాత్రి ఎనిమిది గంటల నుండి పన్నెండు గంటల వరకు పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడట. పనిలో పని అక్కడ పనిచేస్తున్న ఓ అందమైన నర్స్ ట్రెయినీని, ఓ గోల్డ్ చెయిన్, ఓ ఉంగరం, ఓ రిస్ట్ వాచ్‌లు ప్రెజెంట్ చేసి మొత్తం పదివేలు విలువచేసే లవ్ చేసేట్ట. ట్రైనింగ్ అవంగానే లవ్ చాలించుకుని, ప్లాన్ ప్రకారం ఆ అమ్మాయి ఇంకో ట్రైయినింగయిన బోయ్‌ఫ్రెండ్‌తో ఇరాన్ ఉడాయించింది. దాంతోవీడి రోగం కుదిరిందట."

"మరిప్పుడు పెళ్లంటున్నావు!"

"ఇదిగో శుభలేఖ, చాలా మంచి సంబంధం. నర్సిమ్లు చాలా అదృష్టవంతుడు అంటూ పెళ్లికూతురు ఫోటో చూపెట్టింది."

"ఎలా ఉంది పెళ్లికూతురు?"

"నచ్చకేం చేస్తుంది! వాడి కాబోయే మామగారికి రెండు లారీలు, రెండు టేక్సీ కార్లు, ఓ మోటార్ వర్క్‌షాపు వున్నాయిట. బుద్ధొచ్చి కిక్కురుమనకుండా ఒప్పుకున్నాడు."

పెళ్లి ఘనంగానే జరిగింది. వెళ్లినందుకు ఇచ్చిన ప్రెజెంటేషన్‌కి సంతోషించేరు. ఆశీర్వదించేం. రాత్రి యింటికెళ్లేటప్పటికి లేటయింది. మారెండోవాడు రెండుసార్లు ఫోన్‌చేశాట్ట. రోపొద్దున్నే ఎనిమిదింటికల్లా వస్తాను, ఇంట్లో వుండమన్నాడుట.

"విశ్వనాథం గారమ్మాయి, నారాయణరావు గారమ్మాయి, ఇద్దరూ బాగుంటారు. మీరు గట్టిగా చెప్పండి. వాడెప్పుడొస్తున్నాడెప్పుడొస్తున్నాడని ఫోన్లు మీద ఫోన్లు చేస్తున్నారు. అందులో ఏదో సంబంధం ఖాయం చేసెయ్యాలండీ" అంది.

"వాడికి నచ్చాలి కదా!" అన్నాను.

"నచ్చడమేమిటండీ! నచ్చచెప్పాలి. ఐయేయస్ పేసయ్యేడు. నర్సిమ్ములుపాటి..." నేను వినదల్చుకోలేదు.

మర్నాడుదయం ఎనిమిదింటికి నేనూ మా ఆవిడా పేపర్ తిరగేస్తూ మావాడి రాకకోసం, హాల్లో ఎదురుచూస్తూ కూర్చున్నాం. కారొచ్చి గుమ్మం ముందు ఆగింది. రాత్రెక్కడో హోటల్లోదిగి పొద్దున్నే ముస్తాబై ఒచ్చినట్లున్నాడు. ముందు సీట్లోంచి కొత్త బట్టలు, మెళ్లో పూలదండలతోనూ మావాడూ జానకీ, వెనక సీట్లోంచి బంగళా వాచ్‌మన్ జంగయ్యా, వాడి పెళ్లాంఎల్లమ్మా దిగి లోపలికొస్తున్నారు. మేమిద్దరం నిర్ఘాంతపడి నిలబడ్డాం.

వంశ మర్యాద, సాంప్రదాయం గురించి అరడజను సినిమాల్లో డైలాగులు రంగరించిన కషాయం మింగినట్లు మా ఆవిడ మావాడికేసి మౌనంగా చురచుర చూసింది. బిక్కుబిక్కుమంటూ జంగయ్య ఎల్లమ్మా చేతులు జోడించుకుని తలలు దించుకుని వెనక నిలబడ్డారు. "మీ సరదాకి మీరు కన్నారు. మీ యిష్టప్రకారం మీరు పెంచేరు. నా విద్యాబుద్ధులకి మెచ్చుకున్నారు. మరి నాకూ కోరికలూ అభిరుచులూ వుంటాయి కదమ్మా!" అంటున్నట్టు చిరునవ్వుతో, భయభయంగా చేతులు జోడించి నిలబడ్డ జానకి నడుం చుట్టూ చెయ్యివేసి మావాడు ముందుకు నడిచి వొస్తుంటే మా ఆవిడ గిరుక్కున తిరిగి యింట్లోకి వెళ్లింది. వాళ్లిద్దరూ నా కాళ్లకు నమస్కరిస్తుంటే త్రికణ శుద్ధిగా దీవించేను. వాళ్లు లేచి నిలబడి నా వెనక వైపు సంభ్రమాశ్చర్యాలతో చూస్తుంటే నేనూ వెనక్కి తిరిగేను. ప్రసన్నవదనంతో హారతి పళ్లెం తెస్తూంది మా ఆవిడ.

** అన్వేషణ, అక్టోబరు 1995*